ప్రజాశక్తి

గురువారం 20 ఫిబ్రవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తాగునీటిపై ముందస్తు ప్రణాళిక

- స్థానిక సంస్థల నిధులతో మరమ్మతులు
- క్రాష్ ప్రోగ్రాంలో పథకాల పనితీరు గుర్తింపు



సబ్బవరం మండలం గాలి భీమవరంలో బోరు బాగు చేస్తున్న మెకానిక్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

రాబోయే వేసవిలో తాగునీటి సమస్య ఎదురుకాకుండా గ్రామీణ తాగునీటి సరఫరా శాఖాధికారులు ముందస్తు చర్యలు ప్రారంభించారు. క్రాష్ ప్రోగ్రాం కింద మరమ్మతులకు గురైన చేతిబోర్లు, రక్షిత మంచినీటి పథకాలను గుర్తిస్తున్నారు. మార్చి 15వ తేదీ లోపు మరమ్మతులు పూర్తిచేసేలా ప్రణాళిక తయారుచేశారు. బోర్లు, రక్షిత మంచినీటి పథకాల పూర్తిస్థాయిలో పనిచేయకపోవడానికి గల కారణాలు గుర్తించి, మండల పరిషత్ నిధులు, పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించి మరమ్మతు చేయనున్నారు. జిల్లాలో 24 మండలాల పరిధిలో 572 పంచాయతీల్లో 16,059 చేతి బోర్లున్నాయి. 1850 పిడబ్ల్యుఎస్ స్కీములు, 28 రక్షిత మంచినీటి పథకాలు(సిపిడబ్ల్యు) ఉన్నాయి. బోర్లు, రక్షిత మంచినీటి పథకాలు ప్రస్తుతం ఎలా పనిచేస్తున్నాయి? పనిచేయకపోతే కారణాలేంటి? అనేది క్రాష్ ప్రోగ్రాంలో గుర్తించి, వాటికి అవసరమైన పరికరాలకు అయ్యే వ్యయం అంచనావేసి నివేదించనున్నారు. వేసవి ప్రవేశించే నాటికి తాగునీటి సమస్య లేకుండా మరమ్మతులు చేయనున్నట్లు గ్రామీణ నీటి సరఫరా శాఖాధికారులు చెబుతున్నారు.

తాగునీటి పథకాల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో స్థానిక సంస్థల నిధులను వినియోగించనున్నారు. గతంలో వేసవిలో బోర్లు, రక్షిత మంచినీటి పథకాల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదించేవారు. చాలా కాలంగా ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా మండల పరిషత్, పంచాయతీలు, జిల్లా పరిషత్ నిధులను వినియోగించనున్నారు. గతంలో చేసిన చేసిన మరమ్మతు పనులకు అయ్యే ఖర్చులు ప్రభుత్వం నుంచి రాలేదు. దీంతో స్థానిక సంస్థల నిధులతో ప్రజల అవసరాలను తీర్చనున్నారు. పంచాయతీల్లో సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులు సరిపడా లేకపోతే సర్దుబాటుచేసి మరమ్మతు పనులకు ఆటంకం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిస్థితిని కూడా గుర్తించి ప్రత్యేక ఏర్పాట్లు చేయడానికి ప్రణాళిక తయారుచేశారు.

మందుబాబుల జేబులకు చిల్లు

మద్యంపై 10 నుంచి 15 శాతం ధరల పెంపు

విశాఖ జిల్లాలో నెలకు రూ.8 కోట్ల అదనపు భారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మద్యం ధరలు పెంపుదలతో మందుబాబులు జేబులకు చిల్లు

ధరలు పెరిగిన బ్రాండ్లలో కొన్ని

బ్రాండ్	పాత ధర	కొత్త ధర
ఇండియన్ గ్రెన్ విస్కీ	రూ.150	రూ.160
8పిఎం ప్రీమియం రిజర్వ్ విస్కీ	రూ.220	రూ.240
ఎసి బ్లాక్ క్లాసిక్ విస్కీ	రూ.150	రూ.160
డార్క్ బ్లూ డీలక్స్ విస్కీ	రూ.180	రూ.190
ఆఫ్టర్ డార్క్ బ్లూ డీలక్స్ విస్కీ	రూ.180	రూ.190
డైరెక్టర్స్‌స్పెషల్ గోల్డ్ విస్కీ	రూ.130	రూ.140
హేవార్డ్స్ ఫైన్ విస్కీ	రూ.130	రూ.140
మూమెంట్స్ వోడ్కా	రూ.230	రూ.240
వైట్ హోల్ రేర్ ప్రీమియం బ్రాందీ	రూ.150	రూ.160
మేజిక్ మంజీరా బ్లూ విస్కీ	రూ.130	రూ.140
మార్ఫ్యూస్ బ్రాందీ	రూ.290	రూ.300
ఆఫీసర్స్ ఛాయిస్	రూ.150	రూ.160
ఓల్డ్ మంక్ రమ్	రూ.220	రూ.230
రాయల్ ఛాలెంజ్ విస్కీ	రూ.210	రూ.220
ఇంపీరియల్ బ్లూ విస్కీ	రూ.360	రూ.370
రాయల్ స్టాగ్	రూ.230	రూ.240
మాన్షన్ హౌస్ ఫ్రెంచ్ బ్రాండ్	రూ.100	రూ.110
మాన్షన్ హౌస్ స్పిరిట్ ఫ్రెంచ్ బ్రాందీ	రూ.190	రూ.200



పడుతోంది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం తక్కువ ధరకు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తాజాగా మద్యం ధరలను పెంచింది. బ్రాండ్లను బట్టి 10 నుండి 15 శాతం మేర ధరలు పెంచింది. అయితే క్వార్టర్ చిన్న బాటిల్ ధర ముందుగా ప్రకటించిన విధంగానే రూ.99కే అమ్మకం చేస్తున్నారు. బీరు ధరల్లో కూడా మార్పు లేదు. మిగిలిన బ్రాండ్ ధరలు మాత్రం పెంచారు. మందుబాబులు ఎక్కువ ఇష్టంగా తాగుతున్న బ్రాండ్లపైనే 15 శాతం రేట్లు పెంచి మందుబాబుల జేబులకు చిల్లు పెట్టింది. కూటమి ప్రభుత్వం వస్తే మద్యం రేట్లు తగ్గుతాయని ఆశ పడిన మందు బాబులకు భంగపాటు ఎదురైంది. ఒక్కో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.12 వరకు ధర పెరిగింది. దీంతో విశాఖ జిల్లాలో మందుబాబులపై నెలకు రూ.8 కోట్ల అదనపు భారం పడను న్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఎక్సైజ్ శాఖకు సంబంధించి మహారాణిపేట, సీతమ్మధార, గోపాలపట్నం, గాజువాక, పెందుర్తి, భీమిలి ఎక్సైజ్ స్టేషన్లో పరిధిలో మొత్తం

మిగతా 2లో..

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలి

వార్త 5లో..

ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్‌పిలతో రేంజ్ డిఐజి సమీక్ష

వార్త 8లో..

విశాఖపట్నం-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

వార్త 7లో..

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట

హౌసింగ్ రివ్యూలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్‌టిఆర్ కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీపడకుండా పనులను వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో వ్యవహరించి మరింత పురోగతి సాధించాలని, వ్యక్తిగత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా చేరుకోవాలని నిర్దేశించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగు హాలులో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. లే-అవుట్ల వారీగా సమీక్షించిన కలెక్టర్ అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు స్టేజ్ కన్వర్షన్ జరగాలని, నిర్మాణాలు పూర్తిచేయాలని చెప్పారు. మండల ప్రత్యేక

మిగతా 2లో..



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ఉద్యోగ భద్రతకు ఆప్కాస్ కార్మికుల మహాధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉద్యోగ భద్రతతో పాటు, ఆప్కాస్ కంటే మెరుగైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆప్కాస్ కార్మికులు బుధవారం మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మాట్లాడుతూ, ఆప్కాస్‌ను రద్దు చేస్తే కాంట్రక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు ఇవ్వొద్దని కోరారు. జిఒ 1615, జిఒ 96 ప్రకారం మినిమం టైం స్కేల్ వేతనాలు చెల్లించాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండా డెత్, రిటైర్మెంట్ కార్మికుల కుటుంబ సభ్యులకు వెంటనే ఉపాధి కల్పించాలని, ఎంప్లాయి అన్న పదాన్ని తొలగించి ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని, రద్దుచేసిన కార్మిక కుటుంబ సభ్యుల పెన్షన్లు, పథకాలను పునరుద్ధరించాలని, 62 సంవత్సరాల రిటైర్మెంట్ వయస్సును కొనసాగించాలని, సమ్మె ఒప్పందం ప్రకారం ప్రమాద మరణానికి రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా, మట్టి ఖర్చులు రూ.20 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75 వేలు చెల్లించేలా జిఒలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. పెరిగిన మహా నగర జనాభా, విస్తీర్ణం, వార్డుల సంఖ్య ఆధారంగా సిబ్బందిని పెంచాలని కోరారు. మున్సిపాలిటీలపైన భారం పడకుండా, ఎటువంటి సర్వీసుఛార్జీ లేకుండా, దళారీ దోపిడీ, టెండర్స్ పద్ధతి లేకుండా, స్లం లెవెల్ ఫెడరేషన్, టౌన్ లెవెల్ ఫెడరేషన్‌ల ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం పర్మినెంట్ ఉద్యోగుల వలే ఒక ఎస్టాబ్లిష్మెంట్ ఏర్పాటుచేయాలని, ఆప్కాస్‌లో చేర్చని క్లాప్ డ్రైవర్లు, లోడర్లు, ఈ

మిగతా 2లో..



మహాధర్నాలో పాల్గొన్న జివిఎంసి ఆప్కాస్ కార్మికులు

మొదటి పేజీ తరువాయి..

మందుబాబుల జేబులకు చిల్లు

145 మద్యం దుకాణాలకు ఉన్నాయి. ఇవి కాకుండా, 119 బార్లు ఉన్నాయి. వీటన్నింటి ద్వారా రోజుకు సుమారు రూ.9 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరుగుతాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. పెరిగిన ధరలతో నెల మొత్తం చూస్తే రూ.8 కోట్ల వరకు అదనంగా ఆదాయం వచ్చే వీలుందని అంటున్నారు. మద్యం వ్యాపారులకు లబ్ధి కలిగే విధంగా, వారికి ఇంతవరకు అమ్మకాలపై ఇచ్చే కమిషన్‌ను ప్రభుత్వం 14 శాతం పెంచింది. ఇందువల్ల మద్యం ధరలు పెంచాల్సి వచ్చిందని ప్రభుత్వ వర్గాల కథనం. వ్యాపారులకు ఇచ్చే కమిషన్ శాతంతో పోలిస్తే పెంచిన ధరలు తక్కువ అని అంటున్నారు. వాదన ఎలా ఉన్నా, ధరల పెంపుదల పట్ల, ముఖ్యంగా అధికంగా అమ్మకాలు జరిగే బ్రాండ్లపై ధరలు పెంచడం మందు బాబులకు ఏమాత్రం రుచించడం లేదు.

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట

అధికారులు, లే-అవుట్ ఇన్‌ఛార్జి అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని క్షేత్ర స్థాయి అధికారులకు తగిన సహకారం అందించాలని సూచించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి అన్ని ఇళ్లను పూర్తి చేసే విధంగా ఇప్పటి నుంచే వేగం పెంచాలని, తగిన కార్యాచరణ రూపొందించుకొని నాణ్యతకు పెద్దపీట వేస్తూ పనులను సాగించాలని చెప్పారు. అనకాపల్లి జిల్లా కుంచంగి, సబ్బవరం మండలం పెదముషిడివాడలో స్థానికుల నుంచి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని, పనులు ముందుకు సాగటం లేదని హౌసింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే అనకాపల్లి జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో సంప్రదించి సమస్యను వివరించారు. పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లే-అవుట్ పరిధిలో ఉన్న గ్రావెల్‌ను తవ్వుకొని వాడుకుంటున్నప్పటికీ స్థానిక అధికారులు అభ్యంతరాలు తెలుపుతున్నారని తెలుపగా మైన్స్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. భవిష్యత్తులో అలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని చెప్పారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, డిఇలు సూర్యారావు, నారాయణప్రసాద్, లే-అవుట్ ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్న ఎడిసి రమణమూర్తి, యుసిడి పీడీ సత్యవేణి, డిసిఒ ప్రవీణ, ఎస్‌డిసిలు శేష శైలజ, సునీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రతకు ఆప్కాస్ కార్మికుల మహాధర్నా

– ఆటో, స్వీపింగు, బాబ్ కాట్, కంపాక్ట్ డ్రైవర్లు, ఎలక్ట్రికల్ కాంట్రాక్టు కార్మికులు, బదిలీ కార్మికులను మెరుగైన వ్యవస్థలో విలీనం చేయాలని కోరారు. కార్మికుల మొత్తం పిఎఫ్‌ను ఒకే అకౌంట్‌లో జమ చేయాలని, పిఎఫ్, జీతం స్లిప్పులు మంజూరు చేయాలని, శాశ్వత స్వభావం గల విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ కార్మికులను 2/94 చట్టం స్థానంలో మరో చట్టాన్ని తీసుకొచ్చి పర్మినెంట్ చేయాలని, క్లియర్ వేకెన్సీలో పారిశుధ్యం, నీటి సరఫరా కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఎంవి.ప్రసాద్, జి.అప్పారావు, జెఆర్.నాయుడు, నీటి సరఫరా యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్‌కుమార్, కె.వెంకటరావు, యుజిడి నాయకులు ఇ.ఆదినారాయణ తదితరులు మాట్లాడారు. మహాధర్నాలో పారిశుధ్యం, మలేరియా, ఎమ్ఎస్ఎఫ్ డ్రైవర్లు, నీటి సరఫరా, యుజిడి, ఇంజినీరింగ్, పార్కులు, ఆఫీస్, తదితర అవుట్ సోర్సింగ్ కార్మికులు, సీర రమణ, గణేష్, ఎం.ఈశ్వరరావు, శ్రీను, బాలు, వరలక్ష్మి, హేమలత, పద్మ, లలిత, రాజశేఖర్, వెంకటరావు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.10 లక్షలు బీమా

జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆర్‌టిసిలోని ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులందరికీ రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. బుధవారం సాయంత్రం తన ఛాంబర్‌లో పోస్టల్ అధికారులు, పర్సనల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అన్ని డిపోల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రమాద బీమా అన్ని అద్దె బస్సుల డ్రైవర్లు, పొరుగు సేవల డ్రైవర్లు, బస్సు అటెండర్లు, బస్సు స్టాండ్, గ్యారేజ్, ఆర్‌టిసి కార్యాలయాల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ స్వీపర్లు, ట్రాఫిక్ గైడ్లు, కౌంటర్లలో టికెట్స్ బుక్ చేసే సిబ్బంది, ఇతర ఉద్యోగులు అందరికీ వర్తిస్తుందని తెలిపారు. పోస్టల్ శాఖ అంత్యోదయ శ్రామిక్ సురక్ష యోజన కింద ఈ బీమా అమలు చేయనున్నట్లు వివరించారు. దీనికి ఒక్కరికి రూ.499 చొప్పున ప్రీమియమ్‌ను ఆయా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకున్న గుత్తేదారులు చెల్లించాలని తెలిపారు.

చార్ధామ్ యాత్రకు 'భారత్ గౌరవ్ ట్రైన్'



మీడియాతో మాట్లాడుతున్న జిఎంవిఎన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చార్ధామ్ యాత్రకు వెళ్లాలనుకునే వారి కోసం మొదటి 'భారత్ గౌరవ్ ట్రైన్' అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఉత్తరాఖండ్ ప్రభుత్వ యూనిట్ గఢ్వాల్ మండల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (జిఎంవిఎన్) ప్రజా సంబంధాల అధికారి వీరేందర్ సింగ్ రాణా తెలిపారు. బుధవారం మేఘాలయ హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రత్యేక పర్యాటక రైలు హరిద్వార్, యమునోత్రి, గంగోత్రి, కేదారనాథ్, బద్రీనాథ్ ప్రాంతాలను కవర్ చేస్తుందన్నారు. 16 రోజుల పూర్తి స్థాయి ప్యాకేజీ టూర్ మే 8న ప్రారంభం కానుందని తెలిపారు. ప్రస్తుతం బుకింగ్‌లు తెరుచున్నాయని చెప్పారు 1ఎసి, 2 ఎసి, 3 ఎసి, స్లీపర్ కోచ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. గమ్యస్థానాలు, మార్గాల గురించి సమాచారం ఉంటుందన్నారు. ఎంటర్టైన్మెంట్ సిస్టమ్, సిసిటీవీ కెమెరాలు, టూర్ మేనేజర్, హౌస్ కీపింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది ప్రతి కోచ్‌లో ఉంటారని తెలిపారు.

పర్యాటక రైలు సేవా సంస్థ టూర్ టైమ్స్ రీజనల్ మేనేజర్ రమేశ్ అయ్యంగార్ మాట్లాడుతూ, ఈ పవిత్ర యాత్రను భారతీయ రైల్వేలు, టూర్ టైమ్స్ భాగస్వామ్యంతో తీసుకుకొచ్చినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక ప్యాకేజీలో సైట్ సీయింగ్, హోటల్ వసతి (రాత్రి బస ఉన్న ప్రాంతాల్లో) కల్పించనున్నట్లు వివరించారు. యాత్ర మొత్తం రైలు లోపల, బయట హోటళ్లలో దక్షిణ భారతీయ భోజనం అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎల్టీసి, ఎల్ఎఫ్సీ సౌకర్యం ఉపయోగించుకోవచ్చున్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ 33 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. థర్డ్ ఎసికి రూ.70,500, సెకెండ్ ఎసికి రూ.75,500, ఫస్ట్ ఎసికి రూ.82,500, స్లీపర్‌కు రూ.58,500 ఛార్జి ఉంటుందని తెలిపారు. బుకింగ్ తదితర సమాచారం కోసం www.tourtimes.in, 9160021414, 9160091414ను సంప్రదించాలని సూచించారు.

'లీడర్ దినపత్రికకు జారీ చేసిన వారెంట్‌ను రద్దుచేయాలి'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : లీడర్ పత్రికకు ఆర్‌డిఒ జారీ చేసిన వారెంట్‌ను రద్దు చేయాలని, ఆమెను సస్పెండ్ చేయాలని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యాన బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా, జర్నలిస్టు సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ, ఆర్‌డిఒ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మండిపడ్డారు. లీడర్ దినపత్రికలో ప్రచురించిన కథనాలపై జారీ చేసిన వారంట్‌లో ప్రజల శాంతికి భగ్నం కలిగించారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని సిఆర్‌పిసి సెక్షన్ 505 కింద రెండేళ్లకు పైగా జైలు శిక్షతో పాటు జరినామా కూడా విధించే కేసులు నమోదు చేస్తామని బెదరింపులకు పాల్పడ్డారని తెలిపారు. పత్రికను ఎందుకు మూసి వేయించరాదని, అక్రిడేషన్లు రద్దు చేస్తామంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇది పూర్తిగా పత్రికా స్వేచ్ఛపై దాడిగా భావిస్తున్నామన్నారు. లీడర్ ప్రచురించిన కథనాలపై అభ్యంతరాలుంటే ఖండన, లేదంటే ప్రెస్ మీట్ పెట్టి అభ్యంతరాలు చెప్పొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పి.సత్యనారాయణ, ఎం.యుగంధర్ రెడ్డి, టి.నానాజీ, కె.రాము, కె.చంద్రమోహన్, ఈశ్వర్ చౌదరి, జార్జి త ది త ర ు ల ు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు సన్మానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కర్ణాటకలోని బళ్లారిలో ఇటీవల జరిగిన సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో ఇండియన్ రైల్వే బాల్ బ్యాడ్మింటన్ జట్టు విజేతగా నిలిచింది. వాల్తేరు డివిజన్‌కు చెందిన ముగ్గురు ఆటగాళ్లు సిహెచ్.వెంగళరావు, డీవీ గణేష్, పి.కార్తీక్ ఈ టోర్నమెంట్లో జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. టోర్నమెంట్‌లో విశేష ప్రతిభ కనబరిచిన సిహెచ్.వెంగళరావును స్టార్ ఆఫ్ ఇండియా అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులందరినీ వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్ కుమార్‌సాహూ, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.అవినాష్ ఘనంగా సత్కరించారు.

రఘువర్మకు మద్దతు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు టిడిపి, జనసేన మద్దతు ఇస్తున్నాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చెప్పారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, పార్టీ కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాలతో రఘువర్మకు మద్దతు ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, శాసనమండలి మాజీ సభ్యుడు ఎఎస్.రామకృష్ణ, శాసనమండలి విప్ డాక్టర్ వేపాడ చిరంజీవి, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణశ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లకు అదనపు బోగీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : 18107 రూర్కెలా-జగదల్పూర్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23న , 18117 రూర్కెలా- గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 21 నుండి 23వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేయనున్నారు. 22837 హతియా - ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 24న ఒక థర్డ్ ఎసి ఎకానమీ క్లాస్ కోచ్‌ను జతచేయనున్నారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

అనధికార హోర్డింగ్‌ల తొలగింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : పెదగదిలి బిఆర్‌టిఎస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న పశుసంవర్ధక శాఖ స్థలంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను బుధవారం పశుసంవర్ధకశాఖ సిబ్బంది తొలగించారు. కొన్ని రోజుల క్రితం ఇదే స్థలంలో శివుని విగ్రహం ఏర్పాటు చేసి,తాత్కాలిక షెడ్డు నిర్మించారు. అనంతరం షెడ్డు ముందు భాగంలో శివాలయం పేరిట హోర్డింగ్‌లు పెట్టారు. దీంతో అప్రమత్తమైన వెటర్నరీ యంత్రాంగం,, డీడీ డాక్టర్ నీలయ్య ఆదేశాలతో తొలగించారు. స్థలం కబ్జాకు గురికాకుండా త్వరలో చుట్టూ రక్షణ గోడ నిర్మిస్తామని, గుడి కోసం వేసిన షెడ్డులను, బడ్డీలను కూడా తొలగిస్తామని డాక్టర్ నీలయ్య అన్నారు. గతంలోనూ ఇక్కడ వెలసిన బడ్డీలు, ఆటో స్టాండ్‌ను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసారు.

దేవన్ రెడ్డికి అభినందన



దేవన్‌రెడ్డిని అభినందిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా నియమితులైన తిప్పల దేవన్‌రెడ్డిని బుధవారం జివిఎంసి 87వ వార్డు వైసిపి నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకుని, పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువాలతో సత్కరించారు. దేవన్‌రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి బిసి సెల్ జిల్లా కార్యదర్శి దుగ్గపు దానప్పలు, జగన్ సేవాదళ్ అధ్యక్షులు బోండా గోవిందరాజులు, 86వ వార్డు బిసి సెల్ అధ్యక్షుడు ముద్దపు మురళీమోహన్, రాఘవ అప్పుడు పాల్గొన్నారు.

ఇంటి ఖాళీస్థలంలో చెత్త వేయొద్దు

ప్రజాశక్తి -ములగాడ : ఇంటి ఖాళీ స్థలంలో చెత్తాచెదారాలు వేయడం వల్ల అవి మురిగిపోయి దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలకు ఆవాసంగా మారి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ అన్నారు. జివిఎంసి 63వ వార్డు చింతలలోవ ప్రాంతంలో ఓ ఇంటి ఖాళీ స్థలంలో అక్కడి ప్రజలు చెత్తను వేస్తున్న విషయాన్ని తెలుసుకున్న రమేష్, అక్కడకి వెళ్లి పరిశీలించారు. పరిసర ఇళ్లల్లోని ప్రజలతో మాట్లాడారు. స్థలం ఖాళీగా ఉందని చెత్త వేస్తే, అక్కడ ఉన్నవారే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అవగాహన కల్పించారు. ఖాళీస్థలంలో ఎవరైనా చెత్తాచెదారాలు వేసినట్లు గుర్తిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. జివిఎంసి సిబ్బంది కొండబాబు, మణికంఠ, మత్స్య రాజు పాల్గొన్నారు.

బయోయాక్టివ్ కాంపౌండ్‌ల ప్రయోజనాలపై

గీతంలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) సంయుక్తంగా 'రీసెర్చి ట్రెండ్స్ ఇన్ థెరప్యూటిక్ అప్లికేషన్స్ ఆఫ్ బయోయాక్టివ్ కాంపౌండ్స్' అంశంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి మాట్లాడుతూ తం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో జరుగుతున్న అధ్యాయనాలు వివరించి, కొత్త అంశాలపై పరిశోధకులు దృష్టి సారించాలని సూచించారు. గీతం మూర్తి ప్రయోగశాలల అధిపతి ప్రొఫెసర్ బివిఆర్.టాటా మాట్లాడుతూ పరిశోధనలకు ఉపకరించేలా రూ. 100 కోట్ల వ్యయంతో గీతంలో అధునాతన ప్రయోగశాలలను అభివృద్ధి చేశామన్నారు. సముద్రశాస్త్ర అధ్యయనాల ద్వారా మానవాళికి ఉపయోగపడే బయోయాక్టివ్ కాంపౌండ్‌లను గుర్తించవచ్చునన్నారు. గీతం రీసెర్చి డవలప్‌మెంట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ ఎన్.సత్యంనారాయణ మాట్లాడుతూ గీతం విశాఖ, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంగణాలలో పరిశోధనలు జరిపే వారికి మూర్తి ఫెలో షిప్‌లు అందజేస్తున్నామని వెల్లడించారు. వివిధ కేంద్ర పరిశోధన సంస్థలు అందిస్తున్న రీసెర్చి నిధులను సద్వినియోగానికి అనుసరించాల్సిన విధానాలపై డిఎస్‌టి మాజీ సలహదారు డాక్టర్ మీనాక్షి మున్షి వివరించారు. సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ జి.రవికుమార్ పాల్గొని వివరాలను వెల్లడించారు.

డి-పట్టా భూముల్లో అక్రమ లే-అవుట్లు!

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని రామవరం గ్రామపంచాయతీలో డిపట్టా భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేసి క్రయవిక్రయాలు జరుపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సర్వేనెంబరు 3/1డిలో డిపట్టా భూముల్లో రోడ్లు వేసి, చిన్నప్లాట్లుగా విభజించి అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సుమారు నాలుగు ఎకరాల స్థలంలో చిన్నషెడ్‌వేసి, లేఅవుట్లుగా మారుస్తున్నారని అంటున్నారు. రైతుల నుంచి కారుచౌకగా ఆయా భూములను సేకరించి, స్థానిక నేతల సహకారంతోనే వాటిని లేఅవుట్లుగా మార్చి ఒక్కో ప్లాట్‌ను లక్షల్లో విక్రయించేందుకు ముస్తాబు చేస్తున్నారని అంటున్నారు. డిపట్టా భూములు కావడంతో సంబంధిత పట్టాదారులు ఆయా భూములను అలాగే అనుభవించాలే తప్ప, రూపాంతరం చేయడం, క్రయవిక్రయాలకు ఆస్కారం లేదనే విషయం తెలియక ఎవరైనా ఈ అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను



రామవరంలో డిపట్టా భూముల్లో వేస్తున్న లే-అవుట్లు

కొనుగోలు చేసి మోసపోవద్దని సూచిస్తున్నారు. రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని, అక్రమ లేఅవుట్లపై చర్యలు చేపట్టాలని కోరారు.

దీనిపై తహశీల్దార్ పి.శ్యాంప్రసాద్ వివరణ కోరగా, డిపట్టా భూముల్లో క్రయవిక్రయాలు నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అలా చేస్తే చర్యలు చేపడతామన్నారు. విఆర్‌ఒను పంపి, పరిశీలించి, నివేదిక కోరనున్నట్లు తెలిపారు.

ఘనంగా అప్పలనరసింహం జయంతి



రక్తదాతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి-గోపాలపట్నం : మాజీ ఎంపి పెతకంశెట్టి అప్పలనరసింహం 89వ జయంతిని ఆయన కుమారుడు, విశాఖ పశ్చిమ ఎమ్మెలే, ప్రభుత్వ విప్ పి.గణబాబు ఆధ్వర్యాన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్, పంచకర్ల రమేష్‌బాబు, ఇతర ముఖ్యనేతలు పాల్గొని అప్పలనరసింహ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలకు అప్పలనరసింహాం అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించగా, పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. దాతలకు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే గణబాబు అందజేసి, అభినందనలు తెలిపారు కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, కాళ్లచిన్నా, పీలా శ్రీనువాసరావు, బల్ల శ్రీనువాసరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని నాగులపల్లి గ్రామంలో మాజీ ఎంపీ, కీర్తిశేషులు పెతకంశెట్టి అప్పలనరసింహం 89వ జయంతి బుధవారం ఘనంగా జరిగింది. అప్పలనరసింహం మనుమడు, ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్య సింహ అప్పలనరసింహం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టిడిపి కార్యాలయంలో కేక్ కటింగ్ చేశారు. అనంతరం అప్పలనరసింహం జన్మించిన నాగులపల్లి గ్రామంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరుశురాం, జివిఎంసి 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, సర్పంచ్ జామి చిన్నమ్మలు, దాడి ముసలి నాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, కాళ్ళ చంద్రమోహన్, సుందరపు కనకప్పారావు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి సాయం అందజేత

ప్రజాశక్తి -మధురవాడ : కిడ్నీ సమస్యతో బాధపడుతున్న జివిఎంసి ఏడోవార్డు మధురవాడకు చెందిన పోతిన సాయిబాబుకు ప్రభుత్వం ఆపన్న హస్తం అందించింది. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన ఆర్థికసాయం రూ.6.68లక్షల చెక్కును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన నివాసంలో బాధితుడు సాయిబాబుకు అందించారు. సాయిబాబు రెండు కిడ్నీలు పాడవ్వడంతో ఆయన తల్లి ఆదిలక్ష్మి కిడ్నీ దానం చేశారు. అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందారు.. సాయిబాబు తండ్రి అప్పలనాయుడు ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు పిళ్లా వెంకటరావు పాల్గొన్నారు.

క్షీణించిన పారిశుధ్యంతో అవస్థలు

- పూడుకుపోయిన మురుగు కాలువలు
- ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న విజయరాంపురం వాసులు

ప్రజాశక్తి-పద్మనాభం: మండలంలోని బాందేవ్‌పురం పంచాయతీ విజయరాంపురం గ్రామంలో పారిశుధ్యం క్షీణించడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మురుగుకాలువలు పూడుకుపోయి, చెత్తాచెదారంతో నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలకు ఆవాసంగా మారిపోయాయని అంటున్నారు. మరోవైపు ఎక్కడికక్కడే చెత్తాచెదారం పేరుకపోయిందని వాపోతున్నారు. గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడం, చెత్తాచెదారాన్ని సక్రమంగా తొలగించకపోవడంతో ఈగలు, దోమలు విజృంభించి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. చిరుదోమలు ఇళ్లల్లోని ఆహారపదార్థాలు, తినుబండారాలపై వాలి ఇబ్బంది కలిగిస్తున్నాయని, దీంతో వ్యాధులు ప్రబలుతాయేమోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, గ్రామ పంచాయతీ స్పందించి గ్రామంలోని పారిశుధ్యాన్ని పరిరక్షించాలని, దోమలు ఈగల బెడద నుంచి విముక్తి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.





వాటర్‌ట్యాంకు వద్ద చెత్తాచెదారం .. పూడుకుపోయిన డ్రైనేజీ

నేరాలు ఘోరాలు

అదృశ్యమైన వ్యక్తి హత్య?

- కాపులుప్పాడ గెడ్డ వద్ద లభ్యమైన అవయవ భాగాలు

- తప్పిపోయిన వ్యక్తివేనని బంధువుల అనుమానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : అదృశ్యమైన వ్యక్తి హత్యకు గురయ్యాడనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. బుధవారం కాపులుప్పాడలో ప్రయివేటు లేఅవుట్ గెడ్డ వద్ద దొరికిన పుర్రె, కాలిన సగం కాలు, ఎముకలు, ఇతర అవయవ భాగాలు, అక్కడ దొరికిన ఆనవాళ్లను బట్టి, తప్పిపోయిన వ్యక్తివేనని బంధువులు, పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై సిఐ సుధాకర్ తెలిపిన వివరాలివి.

పెందుర్తి బిసి కాలనీకి చెందిన బుడగ జంగాలు సామాజిక వర్గానికి చెందిన మోతి అప్పన్న(50) కులవృత్తి రీత్యా ఊరూరా తిరిగి జ్యోతిష్యం చెబుతుంటారు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఎప్పటి లాగానే ఈ నెల 9న ఉదయం 9 గంటలకు ఆనందపురం వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన అప్పన్న, మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ కావడం, సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో మరుసటి రోజున కొడుకు దుర్గా ప్రసాద్ ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులతోపాటు , కుటుంబ సభ్యులు గాలిస్తుండగా, గురువారం జివిఎంసి నాలుగోవార్డు కాపులుప్పాడ , ప్రైవేట్ లే అవుట్ సమీపంలో రుద్రాక్ష మాల, ఎరుపు, పసుపు పూసల దండలు, కొద్ది దూరంలో పుర్రె, సగం కాలిన కాలు ఎముకలు లభ్యమయ్యాయి. సిసి కెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా, గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వెనుకన కూర్చొని అప్పన్న ప్రయాణించినట్లు గుర్తించారు. ఆనవాళ్లను బట్టి దొరికిన అవయవభాగాలు అదృశ్యమైన జ్యోతిష్యుడు అప్పన్న వేనని అనుమానిస్తున్నారు. అవి దొరికిన తీరును బట్టి ఎవరైనా హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని నార్త్ ఎసిపి అప్పల రాజు, సిఐ సుధాకర్ పరిశీలించారు. సిఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఫార్మా కార్మికుడు ఆత్మహత్య



సురేష్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-రాంబిల్లి :మండలంలోని లాలంకోడూరులో నివాసముంటున్న గుడిపూడి సురేష్ (38) తాను నివాసముంటున్న ఇంటిలో బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాంబిల్లి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం గ్రామానికి చెందిన గుడిపూడి సురేష్ స్థానిక ఎస్ఇజెడ్‌లోని ఫార్మా కంపెనీలో కార్మికునిగా పని చేస్తున్నాడు. మండలంలోని లాలంకోడూరులో నివాసముంటున్నాడు. సురేష్ తల్లిదండ్రులు చనిపోయారు. భార్య సురేష్‌ను విడిచి వెళ్లిపోవడంతో ఆయన మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన సురేష్ తను నివాసముంటున్న ఇంటిలోనే బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాంబిల్లి సీఐ సిహెచ్ నర్సింగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

122 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నాతవరం మండలం ములగపూడి జంక్షన్ వద్ద 122కిలోల గంజాయిని పట్టుకున్నామని నర్సీపట్నం డిఎస్‌పి పోతిరెడ్డి శ్రీనివాసరావు తెలిపారుముందుగా అందిన సమాచారం మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, నాతవరం ఎస్ఐ భీమరాజు, సిబ్బంది ఆధ్వర్యంలో ములగపూడి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా, కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేశామన్నారు.

ఇళ్ల స్థలాల లబ్ధిదారుల వివరాలివ్వండి

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్లపట్టాలు పంపిణీ చేసిన లబ్ధిదారుల జాబితా వివరాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక పంచాయతీ వార్డు సభ్యులు మహంతి అప్పలరమణ అధికారులను కోరారు. సమాచార హక్కు చట్టం కింద వివరాలను ఇవ్వాలని కోరుతూ ప్రొఫార్మ్‌లో అధికారులకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

భెల్ కార్మికులకు బహుమతుల పంపిణీ



కార్మికులకు కుక్కర్లను అందజేస్తున్న గుర్తింపు యూనియన్ నేతలు

ప్రజాశక్తి- గాజువాక: బెల్ కార్మికులకు సంస్థ తరపున ఏటా ఇస్తున్న బహుమతుల్లో భాగంగా బుధవారం ఒక్కో కార్మికునికి ఐదు లీటర్ల ప్రెషర్ కుక్కర్‌ను అందజేశారు. గుర్తింపు యూనియన్ యునైటెడ్ ఫ్రంట్ నేతల ద్వారా యాజమాన్యం వీటిని కార్మికులకు అందజేసింది.కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి సాహు, ఎజిఎం ఎస్.లీల, సీనియర్ మేనేజర్ జి.చంద్రశేఖర్, సుబాకర్ సాహూ, పివిఎన్. రాజు, కొల్లి దేముడు, పి. భాస్కరరావు, బి.రవీంద్రబాబు, రాజన్న, కంచిపాటి ప్రకాష్, వీరభద్రరావు, పి ప్రసాదరావు పాల్గొన్నారు .

యువతకు క్రీడా కిట్లు పంపిణీ



క్రీడాకిట్లను అందజేస్తున్న శ్రీనివాస యువజనసంఘం సభ్యులు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలో రేవిడిలోని శ్రీనివాస యువజన సేవా సంఘం ప్రతినిధులు సేవాభావాన్ని చాటుకున్నారు. రేవిడి గ్రామపంచాయతీ పరిధిలోని యువత, క్రీడాకారులను ఆటల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో బుధవారం షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ కిట్లను అందజేశారు. శ్రీనివాస సేవా సంఘం అధ్యక్షులు కోన సన్యాసినాయుడు, సెక్రటరీ పద్మనాభస్వామి, కోశాధికారి మజ్జి శంకరరావు, సహాయ కార్యదర్శి కంది సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు పతివాడ ఇంద్రరావు, సభ్యులు బర్ల మధు, ఒమ్మి పైడినాయుడు పాల్గొని స్పోర్ట్స్ కిట్లను అందజేశారు.

విశాఖ కేంద్ర కారాగారంలో శానిటరీ న్యాప్‌కిన్‌ల తయారీ యూనిట్



జైలులో శానిటరీ న్యాప్‌కిన్‌ల తయారీ వద్ద అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో లివింగ్ ఫౌండేషన్ సహకారంతో శానిటరీ న్యాప్‌కిన్‌ల తయారీ యూనిట్‌ను బుధవారం మహిళా ఖైదీల బ్లాక్‌లో ప్రారంభించారు. దీన్నిలివిగ్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి సెంట్రల్‌జైల్ సూపరెంటిండెంట్ మహేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఖైదీల సాధికారతతోపాటు వారి ఆరోగ్యం, పరిశుభ్రతను మెరుగుపరచడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందన్నారు. హనికరమైన రసాయనాలు లేని ముడి పదార్ధాలను ఉపయోగించి, నాణ్యమైన శానటరీ న్యాప్‌కిన్‌ల ఉత్పత్తిపై దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు. మహిళా ఖైదీలకు ఈ యూనిట్ ఆర్థికంగా సహాయపడుతుందన్నారు. ఈ యూనిట్‌లో తయారైన ఉత్పత్తులను రాష్ట్రంలో అన్ని జైళ్లలోని మహిళలకు సరఫరా చేస్తామన్నారు. యూనిట్ స్థాపనకు సహాయ సహకారాలు అందించిన లివింగ్ ఫౌండేషన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప పర్యవేక్షణాధికారి ప్రవీణ్ కుమార్, జైలు అధికారులు పాల్గొన్నారు.

సుందరంగా ఉద్యానవనం


- జివిఎంసి ఆధ్వర్యంలో శరవేగంగా నిర్మాణం
- సంతపాలెంలో మరో ఐదు నెలల్లో అందుబాటులోకి
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, చిన్నారులు



అందంగా తీర్చిదిద్దుతున్న పార్కు లోపలి భాఆగం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎక్కువ మంది పేదలు, మధ్యతరగతి ప్రజలు నివాసాలుండే ఆరిలోవ ప్రాంతంలో చిన్నారులు సరదాగా ఆడుకునేందుకు ఎక్కడా ఆటస్థలాలు, పార్కులు అందుబాటులో లేవు. దీంతో వారంతా రోడ్లపైన, ఇరుకుగావుండే వీధులనుఆట స్థలాలుగా మార్చుకొని ఆడుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ముడసర్లోవ సమీపంలో, సంతపాలెం బిఆర్‌టిఎస్ రోడ్డుకు ఆనుకొని సుమారు 7 ఎకరాల జివిఎంసి స్థలంలో సుమారు రూ.4 కోట్లు వ్యయంతో చిన్న పిల్లల ఉద్యానవనాన్ని జివిఎంసి నిర్మిస్తుంది. ఇప్పటికే ఏపుగా పెరిగి ఉన్న పచ్చని చెట్లకు ఎటువంటి నష్టం కలగకుండా అందమైన ఉద్యానవనాన్ని నిర్మిస్తున్నారు. పచ్చని చెట్ల మధ్య పిల్లలు ఆడుకునేలా సౌకర్యాలు కల్పిస్తున్నారు. 6నుంచి 14 ఏళ్ళ పిల్లలు ఆడకునేందుకు వీలుగా ఆటపరికరాలు, చెట్లపై గుడిసెలు, రోప్ వే, గార్డెనింగ్, వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తున్నారు. వీటితో పాటు మినీ స్టేజ్, పిల్లలు ఒకే చోట కూర్చొని చూసే విధంగా మినీ ఓపెన్ ఆడిటోరియం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. పచ్చని గడ్డితో లాన్స్ పెంచుతున్నారు. వృక్షాలను తొలగించకుండా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసారు. పార్కు అందుబాటులోకి వస్తే పిల్లలు, పెద్దలు ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు వీలుగా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి : గంటా



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం ఎంఎస్‌కె ప్రసాద్ క్రీడా మైదానంలో మరుపిళ్ళ బంగారునాయుడు(బాబ్జీ) జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మరుపిళ్ల.సాయిజ్ఞానేశ్వర్ పది రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు ముగిసాయి. క్రికెట్‌లో 15జట్లు పాల్గొనగా, దుక్కవానిపాలెం జట్టు విజేతగా నిలవగా, ఓనంపేట రన్నరప్‌గా, మూడోస్థానంలో పెద్దిపాలెం జట్టు నిలిచింది. విజేతలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నగదుతోపాటు షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలన్నారు క్రీడల ద్వారా మానసిక శారీరక ఆరోగ్యం కలుగుతుందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మరుపిళ్ళ. బంగారునాయుడు వర్ధంతి పురస్కరించుకొని ఒఎస్‌జి ఫౌండేషన్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. బిపి కల్లాలు కోలాటం గ్రూపునకు సాయి జ్ఞానేశ్వరావు సౌండ్ సిస్టమ్‌కు రూ.15 వేలు నగదు సాయం అందించారు.కార్యక్రమంలో నాయకులు తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి నాయుడు, మరుపిల్ల శ్రీనివాసరావు, కూరాకుల మురళి, ఉప్పాడ అప్పారావు, కూరాకుల వెంకటేష్,s ాకర వెంకటరమణ, సురేష్, బమ్మిడి తారక్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు..

చెడు వ్యసనాలతో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ



సిపిని సత్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి- మాధవధార : చెడు వ్యసనాలకు బానిసలై యువత, విద్యార్థులు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. బుధవారం శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కీర్తిపట్నాయక్ ఆధ్వర్యంలో మురళీనగర్ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపి బాగ్చీ మాట్లాడుతూ, యువత సోషల్‌మీడియా పరిచయాలను తగ్గించుకోవాలని, ప్రేమ వ్యామోహంలో పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు, స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. సైబర్ నేరాలపై యువత అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలు, మహిళలు ఆపద సమయంలో సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుగానీ, లేకుంటే 112 టోల్‌ఫ్రీ నెంబరు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మురళినగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, 50వ వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్ మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో యువత మద్యం, గంజాయికి బానిసలై పెడదోవ పడుతున్నారని, దీన్ని నియంత్రించేందుకు పోలీసులు చర్యలు చేపట్టాలని సిపిని అర్థించారు. కార్యక్రమంలో ఎసిపి పృధ్వీతేజ, కంచరపాలెం సీఐ రవికుమార్, హైస్కూల్ హెచ్ఎం హేమలత, మురళినగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి చింతాడ రామారావు ఉన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి- సీతమ్మధార : గాజువాక పిహెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ .పి.జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. పిహెచ్‌సిలో వైద్యసేవలు, ఇమ్యునైజేషన్ కార్యక్రమం అమలుపై పరీక్షించి, సమీక్షించారు. పిహెచ్‌సిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఒపి, ఐపి సేవలుఇహెచ్ఆర్ డయాగ్నొస్టిక్ సేవలు, మందులు లభ్యత తదితర అంశాలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఎన్‌సిడి 3.0 సర్వే, ఆర్‌బిఎస్‌కె, ఆర్‌కెఎస్‌కె సేవలపై వైద్యాధికారులు, సిబ్బందిని ప్రశ్నించారు. కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్, రిఫరల్ సేవలపై అవగాహన కల్పించారు. అభ ఐడి మ్యాపింగ్ శతశాతం పూర్తిచేయాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బద్రి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

రజకుల అభివృద్ధికి తోడ్పాటు :పల్లా



బల్లల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : కులవృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న రజకులకు అన్ని విధాలా అండగా ఉంటానని స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పెదగంట్యాడ గొడ్డువానిపాలెం సమీపంలో కంచుమాంబ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో బల్లల పండుగ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు చేసి రజకులకు శుభాకాంక్షలు తెలిపారు. రజక వృత్తిలో కొనసాగుతుు తమ పిల్లలను మాత్రం ప్రయోజకులను చేసేలా బాగా చదివించాలని సూచించారు. ఈ సందర్భంగా రజకుల సమస్యలను సంఘం గౌరవాధ్యక్షుడు ఎస్ అప్పారావు ఎమ్మెల్యేకు వివరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటనృత్యం ఆకట్టుకుంది. కార్పొరేటర్ బొండా జగన్, పి రమణ, ఎస్ పైడిరాజు, హరికృష్ణ పాల్గొన్నారు.


ఉపాధి హామీ పనుల పరిశీలన



కూలీల మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ విజయ్‌కుమార్

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ భద్రయ్యపేట వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న చెరువు పనులను. ఎంపిడిఒ ఎం విజయకుమార్ బుధవారం పరిశీలించారు. చెరువులో పనుల్లో పాల్గొన్న ఉపాధి హామీ కూలీల హాజరు రికార్డులను పరిశీలించారు. నిబంధనల మేరకు కూలీలకు పనులు కల్పించాలని, మస్టర్లను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. మండలంలోని 22 గ్రామపంచాయతీల్లోనూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి పనులు జరుగుతున్నాయని ఎంపిడిఒ విజయకుమార్ వివరించారు.

గుంతలమయంగా గొల్లల తాళ్లవలస రోడ్డు



మరమ్మతుకు నోచుకోని గొల్లల తాళ్ళ వలస రోడ్డు ఇదే

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాళ్లవలస పంచాయతీ గొల్లల తాళ్ళ వలస తారు రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు గొల్లల తాళ్ళ వలస జంక్షన్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, జెవి అగ్ర హారం నుంచి గొల్లల తాళ్ళవలస వచ్చేందుకు ఇదే మార్గంలో రాకపోకలు సాగించాలి. రోడ్డులో ఎక్కడికక్కడే గుంతలు ఉండడంతో అటుగా వచ్చిపోయే వారు ఇబ్బందులు పడక తప్పడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో గుంతల రహిత రహదారులు ఏర్పాటు చేయాలని, సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, గొల్లల తాళ్లవలస రోడ్డుకు మోక్షం కలగలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి, గొల్లల తాళ్లవలస గుంతల రోడ్డుకు మరమ్మతులతోపాటు శాశ్వత ప్రాతిపదికన పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలుచేయాలి

జేసీ రాష్ట్ర చైర్మన్ ఎవి.నాగేశ్వరరావు



అభివాదం చేస్తున్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఏవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కేంద్ర పథకాల ద్వారా ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ (ఎంటిఎస్) అమలు చేయబోమని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 2ను వెంటనే రద్దు చేయాలని, ఆప్కోస్‌ను రద్దు చేసి జిల్లాల ఏజెన్సీలకు ఉద్యోగుల కట్టబట్టాలనే క్యాబినెట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం జరిగిన ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 3 లక్షల కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల, ఆప్కాస్ ఉద్యోగుల పట్ల దుర్మార్గమైన వైఖరి తీసుకొని, వారిని అభద్రతాభావంలోకి నెట్టటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో సమగ్ర శిక్ష, మున్సిపల్, అంగన్వాడి తదితర సమ్మెల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ మినిమం టైమ్ స్కేల్ అమలు చేయటం, హెచ్ఆర్ఏ, డిఏ, గ్రాడ్యుటి క్రమబద్ధీకరణ వంటి సౌకర్యాలని తక్షణం అమలు చేయాలని కోరారు. వీటి సాధనకై మార్చి 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జెఏసి జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు బి.కాంతారావు (నాని), అచ్యుత కృష్ణ, బ్రమ్మాజీ, నూకేష్, ఎన్హెచ్ఎం జేఏసీ నాయకులు రామకృష్ణ, పెంటయ్య, క్రిస్టోలైట్, 108 యూనియన్ శ్రీనివాస్, 104 యూనియన్ సాయి, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ యూనియన్ నాయకులు నర్సింగరావు, ఆర్ఎఆర్ఎస్ యూనియన్ నాయకులు నందేశ్వరరావు, లక్ష్మి, కమల, దేవకి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రత్నాకర్, అధ్యాపకులు

ఎఐ టెక్నాలజీ మరింత అభివృద్ధికి కృషిచేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) టెక్నాలజీని మరింత అభివృద్ధి చెందేలా విద్యార్థులు ఆలోచనలు చేయాలని దాడి ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. కళాశాల అకాడమిక్ కౌన్సిల్ మీటింగ్‌లో బుధవారం ప్రాజెక్ట్ రీసెర్చ్ భాగంగా బిటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు రాసిన రీసెర్చ్ ట్రెండ్స్ అండ్ అప్లికేషన్స్ ఇన్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ఎరా అనే పుస్తకాన్ని రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషల్ ఇంటిలెజెన్స్ అధునాతన టెక్నాలజీస్, అప్లికేషన్స్, భవిష్యత్తు అవకాశాలను, సాంకేతికత భవిష్యత్తును రూపొందిస్తుందని తెలిపారు. సియస్ఈ విభాగాధిపతి డాక్టర్ కె.సుజాత మాట్లాడుతూ ఈ పుస్తకానికి ఎడిటర్‌గా ఉండటం తనకి గర్వంగా ఉందన్నారు. ఈ పుస్తకం కేవలం పరిశోధన ఫలితాల సేకరణ మాత్రమే కాకుండా ఇది ప్యూచర్ జెనరేషన్స్‌కి కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎఐ ఆవశ్యకత మరింత పెరగనుందని తెలిపారు. విద్యార్థులు తమ నూతన టెక్నాలజీ పెంపొందించుకుంటూ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఈ టెక్నాలజీని జోడించి వేగంగా, కచ్చితమైనవిగా పనులు జరగటానికి దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణేష్ ప్రసాద్ రెడ్డి, డీన్ అడ్మిన్ కె.ఈశ్వరరావు, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణనాగ్, విభాగాధిపతులు, అకాడమిక్ కౌన్సిల్ మెంబర్స్ పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్ నాయకులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ సత్యనారాయణరావుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా మెగా డీఎస్సీ ఇస్తానని తొలి సంతకం చేశారని, కాని నేటికీ నోటిఫికేషన్ విడుదల చేయలేదని తెలిపారు. లక్షలాదిమంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లో లక్షలాది రూపాయలు ఇచ్చి కోచింగ్ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో తెలియక, అసలు వస్తుందో రాదో అనే అయోమయో పరిస్థితుల్లో పలువురు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు పోస్టుల ఎంపిక విషయంలో అన్యాయం జరిగిందని, తక్కువ పోస్టులు మంజూరు చేస్తారని అభ్యర్థుల ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని జిల్లాలకు స్థానిక అవసరాల రీత్యా పోస్టులు మంజూరు జరిగేలా త్వరితగతిన డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దొక్కరి హరీష్, బి బాబ్జి పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందజేయాలి

ప్రజాశక్తి-పరవాడ : గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వారికి వైద్య సేవలు అందించే విధంగా చూడాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు ఆదేశించారు. మండలంలోని కన్నూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌ని జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం బుధవారం సందర్శించి ఆరోగ్య కార్యక్రమాలు ఎలా అమలు చేస్తున్నది పరిశీలించారు. ఆసుపత్రిలోనే సురక్షిత కాన్పులు జరిగే విధంగా ఎఎన్ఎమ్, ఆశా కార్యకర్తలు ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. జన్మించిన ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. మాతృ శిశు మరణాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి యాప్‌లో అప్లోడ్ చేసి సీజనల్ వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆన్‌లైన్‌లో ఆరోగ్య సేవలు అమలవుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ జగదీష్, స్టాటికల్ ఆఫీసర్ రామచంద్రరావు, కో-ఆర్డినేటర్ జనార్ధన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎమ్ఎస్ఎస్.సాయిరాం, పిహెచ్ఎన్ జానకి రామన్, యుడిసి ఆనంద్ కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



విలేజ్ క్లినిక్‌ను సందర్శించిన టాస్క్‌ఫోర్స్ బృందం

'జ్ఞాన జ్యోతి' శిక్షణపై గోప్యత

- మీడియాకు తెలియజేయని వైనం
- నిర్వహణ ఖర్చులు గురించి తమకు తెలియదన్న ఎంఇఒ
- ఫుడ్ అలవెన్స్ రూ.195, టిఎ రూ.50 ఇస్తున్నామన్న జిల్లా అధికారులు




శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-యలమంచిలి

చిన్నారులకు ప్రీ, ప్రైమరీ స్కూల్లో బోధించడానికి అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి పేరుతో ఆరు రోజుల పాటు ఇస్తున్న శిక్షణపై యలమంచిలిలో అధికారులు గోప్యత పాటించారు. యలమంచిలి కొత్తపేట హైస్కూల్లో జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళవారమే ప్రారంభమైనప్పటికీ మీడియా ప్రతినిధులెవరికీ తెలీకుండా ఎందుకో జాగ్రత్తపడ్డారు. కార్యక్రమం గురించి తెలిసి ప్రజాశక్తి విలేకరి బుధవారం శిక్షణా కేంద్రం కొత్తపేట హైస్కూలుకు వెళ్లారు. అక్కడున్న ఎంఈఓ-2 కుమార్‌ను వివరాలు అడగ్గా ఆరు రోజుల శిక్షణకు అవసరమైన సిలబస్ రూపొందించడం జరిగిందని, అందుకు అవసరమైన రిసోర్స్ పర్సన్స్‌ను కూడా ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నామని, ఈ శిక్షణకు అవసరమైన మెటీరియల్ అంతా సమగ్ర శిక్ష సమకూర్చుతుందని చెప్పారు. శిక్షణకు అయ్యే ఖర్చుల వివరాలు మాత్రం తనకు తెలీదని, ఎంఈఒ-1ను అడగాలని సమాధానమిచ్చారు. ఎంఈఓ ఆఫీసులో వివరాల గురించి ప్రయత్నించగా బడ్జెట్ ఎలకేషన్స్ గురించి తమకు తెలీదన్నారు. ఇదే విషయమై జిల్లా అధికార్లను సంప్రదించగా ఉదయం స్నాక్స్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ కోసం ఒక్కొక్కరికీ రూ.195, టిఎకి రూ.50 చొప్పున చెల్లిస్తున్నామని చెప్పారు. జిల్లా అధికారులు ఇంత స్పష్టంగా వివరాలు తెలియజేయగా, మండల విద్యా శాఖవారు ఖర్చులు గురించి తమకు తెలియదంటూ దాగుడు మూతలు ఆడటంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. యలమంచిలిలో 56 మంది శిక్షణ పొందుతుండగా, వారికి ఆరు రోజుల శిక్షణ కోసం కేటాయించబడ్డ బడ్జెట్ రూ.82,320 సక్రమంగా ఖర్చయ్యే రీతిలో జిల్లా అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది.

పరిశ్రమకు భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలి

చెరువు భూమిని కబ్జా చేసినట్లు రైతు వెంకటరమణ ఆరోపణ



ప్రజాశక్తి-కశింకోట : పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని మండలంలోని గొబ్బూరు గ్రామానికి చెందిన రైతు బుద్ధ వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పరిశ్రమ స్థాపించేటప్పుడు భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పరిశ్రమ నుండి సీఎస్ఆర్ నిధులను గ్రామానికి ఖర్చు చేస్తామని చెప్పిన స్థానిక రాంకో సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం, గొబ్బూరు గ్రామానికి మొండి చెయ్యి చూపిస్తుందని ఆరోపించారు. గ్రామానికి చెందిన కిత్తయ్య చెరువు కూడా పరిశ్రమ కబ్జా చేసి వాడుకుంటుందని, రైతు పంట పొలాలకు వెళ్లే నీరు కూడా అడ్డుకుని ఇబ్బందులకు గురి చేస్తుందని పేర్కొన్నారు. పరిశ్రమ గ్రామస్తులకు ఉపయోగపడకపోయినా దాని వలన అనారోగ్య సమస్యలు మాత్రం భరించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీకి కూడా ప్రభుత్వ నిబంధన ప్రకారం పూర్తి పన్ను కాకుండా నామమాత్రం పన్ను చెల్లించి చేతులు దులుపుకుంటుందని ఆరోపించారు. ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి కంపెనీ కాలుష్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

4న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆటో డ్రైవర్స్, మోటార్ కార్మికులకు ఎన్నికలలో సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలుకు శాసనసభ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మార్చి 4న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేస్తున్నట్లు ఏపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక చోడవరం బస్ స్టాప్ వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్స్, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, చదువుతున్న డ్రైవర్ల పిల్లలకు స్కాలర్ షిప్ మంజూరు చేస్తామని, డ్రైవర్లకు ప్రమాద, వ్యక్తిగత చంద్రన్న బీమా పాలసీ రూ.5 లక్షల నుంచి 10లక్షల రూపాయలు అమలు చేస్తామని, టాటా మ్యాజిక్ వ్యానులు, కార్లు, జీపులకు రోడ్ టాక్స్ గ్రీన్ టాక్స్ లేబర్ టాక్స్ తగ్గిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎనిమిది నెలలు గడిచిన ఒక్క హామీ కూడా నేటి వరకు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ, నాయకులు పెదిరెడ్ల నాగేశ్వరరావు, కరణం చిరంజీవి, మాడిశ శ్రీను, మళ్ల బాబు, తాతారావు, దొంక సింహాచలం నాయుడు, పెంటారావు, కృష్ణ, పాల్గొన్నారు.

ఎపిఐఐసి చైర్మన్‌ను కలిసిన నాగజగదీష్

ప్రజాశక్తి - అనకాపల్లి : ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజును బుధవారం మాజీ ఎమ్మెల్సీ, భీమవరం నియోజవర్గం పరిశీలకులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి తీసుకుంటున్న అంశాలను రామరాజుకు వివరించారు.

సర్వేయర్ డిప్యూటేషన్ రద్దుచేయాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం సచివాలయం సర్వేయర్ వసంత డిప్యూటేషన్ రద్దు చేసి యథావిధిగా కొనసాగించాలని రాజాం గ్రామస్తులు కోరుతున్నారు. నాలుగేళ్లుగా రాజాం గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న వసంతను అధికారులు డిప్యూటేషన్‌పై ఇతర మండలాలకు బదిలీ చేయడంతో గ్రామంలో రెవెన్యూపరమైన సమస్యలు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలో అధికంగా 1400 మంది రైతులు రాజాం రెవెన్యూ పరిధిలో ఉన్నారని, సర్వేయర్ డిప్యూటేషన్ వల్ల కొలతలు, మ్యుటేషన్ నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సర్వే చేస్తున్న అధికారులు

గ్రామాల్లో ఎంఎస్ఎంఇ సర్వే

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ సర్వేకు వ్యాపారులు సహకరించాలని బుచ్చయ్యపేట ఎంపీడీవో వి.విజయలక్ష్మి కోరారు. మండలంలోని రాజాం, తురకలపూడి, సీతయ్యపేట తదితర గ్రామాల్లో బుధవారం ఎంపీడీవో విజయలక్ష్మి, సచివాలయాల సిబ్బంది ఎమ్ఎస్ఎమ్ఈ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలో చిన్న దుకాణాలు మొదలుకొని పెద్దస్థాయి పరిశ్రమల వరకు వాటి వివరాలను ఎమ్ఎస్ఎమ్ఈ సర్వే అండ్ సపోర్ట్ యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వే ద్వారా అవసరమైన సంస్థలకు స్టాండప్ ఇండియా, సీజీటీఎంఎస్ఈ, పీఎమ్ఈజీపీ, పీఎమ్ఎఫ్ ఎంఈ, ముద్ర, పీఎమ్ విశ్వకర్మ తదితర ప్రభుత్వ పథకాల కింద రుణాలు మంజూరు చేస్తారన్నారు. అవసరమైన సంస్థలకు జెడ్ఈడీ, ఐఎస్ఒ 9001, ఐఎస్ఐ మొదలైన నాణ్యత ప్రమాణాలకు సంబంధించిన ధ్రువపత్రాలు పొందడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజాం, సీతయ్యపేట, తురకలపూడి పంచాయతీల కార్యదర్శులు సూర్యనారాయణ, సురేష్, సిహెచ్ఆర్ఎం.సత్యనారాయణ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రానికి ఎమ్మెల్యే కొణతాల పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి : కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతూ తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రాన్ని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వేగంగా అనారోగ్యం నుండి కోలుకోవాలని ఆకాంక్షించారు. భద్రం కుటుంబానికి ధైర్యం చెప్పారు. రామకృష్ణ వెంట మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొడ్డేడ జోగి నాయుడు, పీలా నాగశ్రీను (గొల్ల బాబు), గవర కార్పొరేషన్ డైరెక్టర్ హరి, మంగ ఈశ్వర్, సిపిఐ మాజీ కౌన్సిలర్ తాకాసి వెంకటేశ్వరరావు, శంకరం, జనసేన నాయకులు లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

కనకదుర్గ అమ్మవారి పండగకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామ దేవత శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి పండగ అనుపు మహోత్సవం ఈనెల 20న నిర్వహించడానికి ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. అమ్మవారి అనుపు ఊరేగింపు సందర్భంగా కాళికామాత వేషాలు, తీన్మార్, డప్పులు, తప్పుడు గుళ్ళు, సాయంత్రం అమ్మవారి ఘటాలతో చిటికెల భజనలు, మహిళా కోలాటాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, మంచినీరు, చలువ పందిళ్ళు వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు.

జిల్లాలో విస్తరిస్తున్న 'గోదావరి' మర్యాదలు

- కొత్త అల్లుడికి వంద రకాల పదార్థాలతో భోజనం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ఉభయగోదావరి జిల్లాల్లో నూతన వధూవరులకు వందల రకాల పిండి వంటలు, ఆహార పదార్థాలతో భోజనాలు పెట్టే సంస్కృతి ఉండగా, నేడు అది అనకాపల్లి జిల్లాకు విస్తరిస్తోంది. ఈ నెల 16వ తేదీన మండలంలోని కొండపాలెం గ్రామానికి చెందిన ముచ్చకర్ల వెంకటప్పారావు లక్ష్మీ దంపతులు తమ కుమార్తె కృష్ణ లావణ్యకు పెద్ద మదిన గ్రామానికి చెందిన సురేష్‌తో వివాహం జరిపించారు. బుధవారం నాడు కొత్త అల్లుడు అత్తవారింటికి భార్యతో కలిసి మొదటిసారిగా రావడంతో వంద రకాల పిండి వంటలతో భోజనాలు ఏర్పాటు చేశారు. కుమార్తె అల్లుడికి కొసరి కొసరి ఆహార పదార్థాలను వడ్డించారు. ఈ విషయం కాస్త మండలంలో అందరికీ తెలియడంతో కొత్త అల్లుడికి అతిథి మర్యాదలపై చర్చించుకుంటున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- శిథిలావస్థకు చేరడంతో భయాందోళన చెందుతున్న ప్రజలు

- సురక్షిత ప్రాంతంలో కొత్తది ఏర్పాటు చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ మండలంలోని పి.బోనంగి గ్రామ పంచాయతీ శివారు వివిఎస్ పురం గ్రామంలో జాజులవాని పాలెం నుండి కలపాక గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. అది పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రహదారికి ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ పక్కన నుండి కాలువ నిర్మాణం చేపట్టారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పడిపోతుందని వాహన చోదకులు, గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. సురక్షిత ప్రాంతంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఈ సమస్యను ఉప సర్పంచ్ గొంతిన రాము పరవాడలోని శ్రీమరిడిమాంబ కళ్యాణ మండపంలో ఇటీవల జరిగిన జనసేన పార్టీ ఆత్మీయ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఈ సమస్యను వీలైనంత తొందరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యపై విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించిన తరువాత కాలువ నిర్మాణం పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఇదే..

ఛత్రపతి శివాజీకి ఘననివాళి



గీతం వర్సిటీలో శివాజీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -ములగాడ

జివిఎంసి 62వ వార్డు త్రినాధపురం జివిఎంసి పాఠశాలలో హెచ్ఎం రమణకుమారి ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ 389వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్మికశక్తి లేబర్ యూనియన్ అధ్యక్షులు పెద్దిరెడ్ల నానాజీ పాల్గొని ముందుగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. భారతదేశానికి శివాజీ చేసిన సేవలను కొనియాడి, విద్యార్థులకు వివరించారు. పలురైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, ఇతర సంస్థలకు శివాజీ నామకరణం చేసిన విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని నీలకుండీలు వద్ద గల సాయి స్వామి వివేకానంద పాఠశాలలో ఛత్రపతి శివాజీ జయంతినిబుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పాఠశాల వ్యవస్థాపకులు సురేష్, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరమత సహనం కలిగి, దేశద్రోహులకు సింహస్వప్నం లాంటి ఛత్రపతి శివాజీ దేశరక్షణకు చేసిన సేవలను కొనియాడారు.

మధురవాడ : పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ 395వ జయంతిని పురస్కరించుకుని బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆవరణలోని శివాజీ విగ్రహానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ నివాళులర్పించారు. దేశభక్తి, విజయసాధనపై పోరాట పటిమ కలిగిన విద్యార్థులు ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రొవైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ బాలకుమార్, పాల్గొన్నారు.

సబ్బవరం : సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాన్ని చరిత్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ మాట్లాడుతూ భారతదేశ చక్రవర్తులు అందరిలో ఛత్రపతిగా పేరుగాంచిన శివాజీ విద్యార్థులకు ఎంతగానో ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. తల్లి జిజియా భాయ్ సంరక్షణలో గురువు సమర్థ రామదాసు శిష్యరికంలో ఎదిగి మొగల్ చక్రవర్తులపై యుద్ధం చేసి విజయాన్ని సాధించి ఛత్రపతిగా పేరుగాంచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ వివి గోపాలకృష్ణ, ఎంవి రామకృష్ణ, డాక్టర్ గణేష్ లెక్కల తదితరులు పాల్గొన్నారు.

షాపులు ధ్వంసం వెనుక భూ కుట్ర?

రూ.4 కోట్లు విలువైన స్థలం కాజేయడానికేనని గ్రామస్తుల ఆరోపణ



బార్బర్ షాపును ధ్వంసం చేసిన దృశ్యం

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని లంకవానిపాలెం గ్రామంలో ఈ నెల 3న రెండు షాపులను ధ్వంసం చేయడం వాటి వెనుక ఉన్న ఇనాం భూమిని ఇద్దరు వ్యక్తులు కాజేసే కుట్ర దాగి ఉందని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. లంకవానిపాలెం గ్రామస్తులు తెలియజేసిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పేదవారైన మల్లువలస రమణ బార్బర్ షాపు, బురిడి త్రిమూర్తులు బైక్ పంచర్ల షాపు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ దుకాణాల వెనుక భాగంలో రూ.4 కోట్లు విలువైన ఇనాం భూమి ఉంది. ఈ భూమి అనుభవదారుల్లో ఒకరు, ఈ రెండు దుకాణాలను తొలగించాలని ఎ.కోడూరు పోలీసు స్టేషన్లో నెల రోజుల క్రితం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అది అలా ఉండగానే ఈ నెల 3వ తేదీన 15 మంది దుండగులు మల్లువలస రమణ, బురిడి త్రిమూర్తులుకు చెందిన రెండు షాపులను తొలగించే ప్రయత్నం చేశారు. రమణకు చెందిన బార్బర్ షాపును పూర్తి ధ్వంసం చేశారు. త్రిమూర్తులు షాపును తొలగించే ప్రయత్నం చేస్తుండగా స్థానికులు గమనించి అక్కడికి చేరుకోవడంతో దుండగులు పరారయ్యారు. దీనిపై బాధితులు మల్లువలస రమణ, బురిడి త్రిమూర్తులు ఎ.కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అయితే షాపుల ధ్వంసం చేయడానికి కిరాయి దుండగులను గ్రామానికి ఇద్దరు వ్యక్తులు పురామాయించినట్లు గ్రామస్తులు, గ్రామ సర్పంచ్ ఆరోపిస్తున్నారు. ఈ షాపుల తొలగింపు వెనుక ఇనాం భూమిని ఆ ఇద్దరు వ్యక్తులు స్వాధీనం చేసుకొనే కుట్ర దాగి ఉందని వారు అంటున్నారు. వీరికి మద్దతుగా పెద్ద తలకాయల హస్తం ఉన్నట్లు చెబుతున్నారు. అందువల్లే అధికారులు కూడా ఏమీ చేయలేక తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. దీనిపై విచారణ చేస్తే దీని వెనుక ఉన్న వ్యక్తులు, జరుగుతున్న కుట్ర బయటకొస్తాయని, అందువల్ల సమగ్రమైన విచారణ చేసి, బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మరో వైపు ఈ ఇనాం భూమికి సంబంధించిన మిగిలిన వాటాదారులు ఈ భూమి తమకు కాకుండా సదరు ఇద్దరు వ్యక్తులు మొత్తం భూమిని కాజేయడానికి ప్రయత్నిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు, సర్పంచ్ చెబుతున్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని శివాలయం పునర్నిర్మాణానికి సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు పెద నాయుడు పాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుమారుడు మండల స్వామి నాయుడు జ్ఞాపకార్థం వారి కుమారుడు మండల రాము రూ.51,116 విరాళం బుధవారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో బర్ల రమణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, గెద్దం కృష్ణ, ముత్రి కనకరాజు, కోరాడ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, కొల్లి కృష్ణ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దేవరపల్లి : మండలంలోని తెనుగుపూడి దళిత సేవా సంఘం సభ్యులు మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల నిరుపేద దళిత కుటుంబానికి చెందిన ముప్పిన అప్పారావు తండ్రి జవాలు చనిపోయాడు. ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి ఆసరా కోసం ఎదురుచూస్తున్న తరుణంలో దళిత సేవా సంఘం సభ్యులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడమే ధ్యేయంగా దళిత సేవా సంఘం పనిచేస్తుందని తెలిపారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం డి2 సెక్షన్స్ పరిధిలోని 33/11కె.వి అంతకాపల్లి సబ్ స్టేషన్‌లో పిఎంఐ వర్క్ కారణంగా ఈ నెల 21న శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల అంతకాపల్లి ఫీడర్ పరిధిలోని అంతకాపల్లి, రావులమ్మపాలెం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, రాయపుర అగ్రహారం, ఆరిపాక, బంగారమ్మపాలెం, అడ్డూరు గొట్టివాడ, లగిశెట్టిపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం పేర్కొన్నారు. దీనికి ఆయా గ్రామాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రత్యేక టికెట్ చెకింగ్ డ్రైవ్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : వాల్తేరు డివిజన్ పరిధిలో భద్రత, ప్రయాణికుల సౌకర్యాలను పెంపొందించడానికి ఈ నెల 12 నుంచి 28వ తేదీ వరకు వాల్తేరు డివిజన్ ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. ఈ స్పెషల్ డ్రైవ్‌లో క్రౌడ్ మేనేజ్‌మెంట్, మెరుగైన భద్రతా చర్యలు, రైలు కార్యకలాపాలు సజావుగా సాగడం, మెరుగైన సౌకర్యాలు అందించడం వంటి అంశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్ కుమార్‌సాహూ మాట్లాడుతూ ప్రయాణికుల, యాత్రికుల సౌకర్యవంతమైన ప్రయాణాన్ని నిర్ధారించడానికి, అన్ని స్టేషన్లలో, రైళ్లలో భద్రతా చర్యలను పెంచామని, రైళ్లను సమయానుకూలంగా నడపాలని సూచించామని తెలిపారు. సమర్థవంతమైన రద్దీ నిర్వహణకు వాణిజ్య టికెట్ చెకింగ్ సిబ్బంది, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌తో కూడిన సంయుక్త బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వికలాంగులు, మహిళా ప్రయాణికులకు కేటాయించిన, కేటాయించిన బోగీల్లోకి అనధికారికంగా ప్రవేశించకుండా ఈ తనిఖీలు సహాయపడతాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 12వ తేదీ నుంచి ఇప్పటి వరకు జరిగిన ఈ డ్రైవ్‌లో టికెట్ లేని ప్రయాణం, బుక్ చేయని లగేజీ తదితర 9,300 కేసులను గుర్తించి సుమారు రూ.46 లక్షల వరకు ఛార్జీలు, జరిమానా విధించామని తెలిపారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - అనంతగిరి:మాదక ద్రవ్యాలు సేవించినా విక్రయాలు చేసినా వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.మండల కేంద్రంలోని మాదకద్రవ్యాల- నిషేధంపై బుధవారం మహిళ పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నూతనంగా తీసుకొచ్చిన నవోదయ 2 పథకం ద్వారా మాదక ద్రవ్యాలతో వాటిల్లే ముప్పును ప్రజలకు మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్, మహిళ పోలీసులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న ఎంపిపి

అధికారుల గైర్హాజరుపై సభ్యుల అసహనం

ప్రజాశక్తి రావికమతం : రావికమతం మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన సాఫీగా సాగింది. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడం పట్ల సభ్యులు పలువురు అసహనం వ్యక్తం చేశారు. మండల స్థాయి అధికారులు ఎప్పుడూ ఏ సమావేశానికి పూర్తిస్థాయిలో హాజరు కాలేదని, వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ విధంగా మండల సమావేశాలు జరుగుతున్నాయని పలువురు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ పైల రాజు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా ఎటువంటి చర్యలు, తీర్మానాలు జరపడానికి వీలు లేనందున సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు, వయసు ఎంపీపీలు రమణ, భవాని ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.


నేత్ర వైద్య విభాగాన్ని ప్రారంభిస్తున్న మల్లికార్జున

నేత్ర వైద్య విభాగం ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ ఆయుర్వేద ఆసుపత్రిలో నేత్ర వైద్య విభాగాన్ని బుధవారం ప్రముఖ వ్యాపారవేత్త చక్కా మల్లికార్జున ప్రారంభించారు. ఈ నేత్ర విభాగంలో డిప్లొమో ఇన్ ఆప్తమాలజీ(ఆయుర్) డాక్టర్ ఎమ్.ఏ సుమయ్య, ప్రధాన వైద్యురాలిగా వ్యవహరిస్తారని, నేత్ర వైద్యానికి కావలసిన అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని ఆయుర్వేద ఆసుపత్రి ప్రధాన వైద్యులు రమేష్ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ ఆయుష్ చారిటబుల్ ఫౌండర్ ట్రస్టీ సిహెచ్.వి.కె. నరసింహారావు, ప్రధాన సలహాదారుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ అలపాటి రాజేంద్రప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది, తుని పాయకరావుపేటకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

24న వెంకన్న పందిరి రాటోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని ఈనెల 24 సోమవారం ఉదయం 7.50 గంటలకు ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మహోత్సవ పందిరి రాటోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలియజేశారు. స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు మార్చి 9వ తేదీ నుండి అంకురార్పణతో ప్రారంభమవుతాయని, 10 వ తేదీన ధ్వజారోహణం, రథోత్సవం, కళ్యాణ మహోత్సవం జరుపుతామని, 17వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.స్వామివారి పందిరి రాటోత్సవంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

2న మోదకొండమ్మ తీర్థం

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగుల మండలం ఘాట్ రోడ్ జంక్షన్ లో మోదకొండమ్మ అమ్మవారి పాదాల తీర్థ మహోత్సవం మార్చి 2న ఆదివారం నిర్వహిస్తున్నట్లు వర్తక సంఘం, ఆటో యూనియన్ నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు, గుర్రపు పందేలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం నేల వేషములు తప్పెటగుళ్ళు, ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రికి జిల్లాలో డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


ఇంటి స్థలాల దరఖాస్తుల సేకరణ

ప్రజాశక్తి -గాజువాక : పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న అర్హులైన పేదలందరికీ రెండు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని సిపిఐ నేతలు కోరారు. బుధవారం జివిఎంసి గాజువాక జోన్ పరిధిలోని 72 వ వార్డు చైతన్యనగర్‌లో అర్హులైన పేదల నుంచి వ్యక్తిగత ఇంటిదరఖాస్తులను స్వీకరించారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఇంటి స్థలం కోసం పేదల నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు నివేదిస్తామని సిపిఐ నాయకులు అప్పారి విష్ణుమూర్తి, జి. ఆనంద్ తెలిపారు .

చెత్త నుండి సంపద తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగంపేటలో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రం వద్ద బుధవారం ఒక్కరోజు పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్ మిత్రలకు చెత్త నుండి సంపద తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్వచ్ఛ భారత్ జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, పంచాయతీ జిల్లా అధికారిణి ఆర్.శిరీషా రాణి హాజరయ్యారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో అధికారుల తీరుపై వారు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే తీవ్రమైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మెరిరోజ్, డిఎల్‌పిడిఒ మూర్తి, ఈవోపిఆర్డీ శ్రీనివాస్, 12 మండలాల పంచాయితీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న నాగలక్ష్మి


రక్తదానం చేస్తున్న దాతలు

రక్తదాన శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా వివిఎస్ఎన్ బ్లడ్ బ్యాంక్ సర్వీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు హాజరైన ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ సుధాశారదా మాట్లాడుతూ, రక్తదాన శిబిరాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రిషి కళాశాల కరస్పాండెంట్ సతీష్, బీజేపీ జిల్లా సహ సభ్యత్వ ప్రముఖ పాకలపాటి అరవింద్ రాజు, రిషి స్టడీ సర్కిల్ డైరెక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం పదో వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు 108 కళాసాలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద పంచామృత అభిషేకాలు, గణపతి హోమం, సౌర హోమం, రుద్ర హోమం, నారాయణ హోమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

వైద్యం కోసం రోగుల తరలింపు

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల మండలం సురవరం గ్రామం నుండి 36 మంది రోగులను మెరుగైన వైద్యం కోసం కస్పా జగన్నాధపురం బానోదయ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, శ్రీ కళ్యాణవెంకటేశ్వరస్వామి దేవాలయం వ్యవస్థాపకులు, ఛైర్మన్ రాపేటి రామకొండారావు మాస్టర్ ఆధ్వర్యంలో బుధవారం తగరపువలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించారు. రోగులకు ఉచిత వైద్యం అందించడంతో పాటు మందులను కూడా సరఫరా చేస్తారని అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ కూడా చేస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాగరం సర్పంచ్ కోట్ని జయమ్మ సన్యాసి నాయుడు,గుమ్మాల అప్పలనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


బస్‌లో వెళుతున్న రోగులు

మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సి పాలిటీ జనసేన నాయకులు, మాజీ కౌన్సిలర్ వర్రె శ్రీనివాసరావు రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ మేరకు జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర జోగినాధునిపాలెంలోని శ్రీనివాసరావు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ జనసేన పార్టీ తరపున ప్రమాద భీమా అందేలా చూస్తామన్నారు.


పరామర్శిస్తున్న సూర్యచంద్ర

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ యూనిట్ ఆధ్వర్యాన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్షయ వ్యాధి పై జిల్లా టీబీ వైద్య అధికారి బి.సూర్యనారాయణమ్మ బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి పైబడిన దగ్గు, దగ్గుతో కఫం, రాత్రిపూట జ్వరం రావడం, ఆకలి లేకపోవడం, మెడ మీద కాయలు వంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే దగ్గరలో ఉన్న వైద్యుల్ని సంప్రదించాలని చెప్పారు. విద్యార్థులు స్వగ్రామాలకు వెళ్లినప్పుడు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని వెంటనే వైద్యుల వద్దకు వెళ్లి వైద్య సేవలు పొందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ యూనిట్ వైద్య సిబ్బంది సంధ్య, రామరాజు, పాత్రుడు, సదానందం, అశ్విని, నాగేశ్వరరావు, ధనరాజ్ పాల్గొన్నారు.

విశాఖపట్నం-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : రానున్న వేసవి సెలవుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం-తిరుపతి-విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైళ్ల నడపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. 08583 విశాఖపట్నం-తిరుపతి వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 28వ తేదీ వరకు ప్రతి సోమవారం రాత్రి 19.10 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. 08584 తిరుపతి-విశాఖపట్నం వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు ప్రతి మంగళవారమూ రాత్రి 21.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట మీదుగా ప్రయాణిస్తాయి.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తగరపువలస :భీమిలి మండలంలోనిఅన్నవరం 11 కెవి విద్యుత్ ఫీడర్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో ఈనెల 21న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏపిఇపిడిసిఎల్ మూడవ జోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని అన్నవరం, కంచేరుపాలెం, పెద నాగమయ్యపాలెం, చిన నాగమయ్య పాలెం, ఎర్రయ్యపాలెం, ఆశిపాలెం, ఎన్టీఆర్ కాలనీ తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న పాఠశాలల కో-ఆర్డినేటర్

టెన్త్, ఇంటర్ విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-గొలుగొండ: ఉమ్మడి విశాఖ జిల్లా రెసిడెన్షియల్ పాఠశాలల కోఆర్డినేటర్ పద్మావతమ్మ బుధవారం గొలుగొండ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ప్రిన్సిపాల్ ఎం.కోటేశ్వరరావు, విద్యా కమిటీ ఛైర్మన్ చిట్ల చలపతిరావు, ఎయిమ్ పొలిట్ బ్యూరో సభ్యుడు సరమంత వీరబాబు, నర్సీపట్నం గురుకుల పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ మేలిపాక శివతో చర్చించారు. ఈ సందర్భంగా 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని చెప్పారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.



నమోదు చేస్తున్న సిబ్బంది

పలు గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని అడ్డలోవ గ్రామంలో బుధవారం మండల వ్యవసాయాధికారి కే.సుధారాణి ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్ కాకపోతే ప్రభుత్వ పథకాలు పొందలేరని చెప్పారు. ఈ నెల 25వ తేదీ వరకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. రైతులు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు.

మాడుగుల: డి.గొటివాడ, ఎం. కోడూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహంచారు .రైతులకు ఫార్మర్ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వాసుదేవరావు మాట్లాడుతూ,రైతులు ఆధార్ కార్డు, అనుసంధానం అయిన ఫోన్, 1బి తీసుకొని దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రతీ పథకానికి ఈ విశిష్ట సంఖ్య తప్పనిసరిగా ప్రతీ రైతు పొందాలన్నారు. దీంతో రైతులు బ్యాంకుల నుండి పంట ఋణాలను, పంటల భీమా పథకాన్ని, పంటనష్టం సంభవిస్తే ప్రభుత్వం ఇచ్చే పెటుబడి రాయితిని పొందవచ్చునని తెలిపారు.



బారులు తీరిన భక్తులు

గర్నికంలో ఘనంగా తీర్థం

ప్రజాశక్తి రావికమతం: మండలంలో గర్నికం గ్రామంలో బాలచంచమ్మ తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. భారీ లైటింగ్లతో, మందు గుండు సామాగ్రితో, పలు సాంస్కతిక కార్యక్రమాలతో తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఏజెన్సీలో పిడిఎఫ్ అభ్యర్థి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-సీతంపేట :పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలో పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి విస్తృత ప్రచారం చేపట్టారు. బుధవారం సీతంపేట మండలంలో నాయుడుమల్లి, సీతంపేట, శంభాం, ముత్యాలు గ్రామాల్లోని విద్యాలయాలకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 33 ఏళ్లుగా నిజాయితీ, నిబద్ధతతో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించడం, 12వ పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించడం, ఆర్థిక బకాయిలు చెల్లింపు, కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులను రెగ్యులర్ చేయడం, తదితర డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో జిఒ 114 అమలుకు పనిచేస్తానన్నారు. కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయడానికి, రెగ్యులర్ చేయడానికి తనవంతు ప్రయత్నిస్తానని తెలిపారు. జిఒ 3 పునరుద్ధరణకు కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల గొంతును శాసనమండలిలో వినిపించేందుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజకుమారి, జిల్లా మహిళా కార్యదర్శి విశాలాక్షి, మహిళా నాయకులు చంద్రకళ, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు, కార్యదర్శి కె.కృష్ణారావు, కౌన్సిలర్లు బి.జయప్రకాశ్, పి.కృష్ణారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.ఆనందరావు, గణేష్, ట్రెజరర్ సింహాచలం, నాయకులు శ్రీనివాసరావు, బి.పకీరు, పద్మశ్రీ, పి.నారాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులతో కలిసి విక్టరీ చిహ్నం చూపిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

విజయగౌరి గెలుపు ఉపాధ్యాయులకు కీలకం
ఫ్యాప్టో పూర్వ ఛైర్మన్ బాబురెడ్డి

రాజాం: రాష్ట్రంలో విద్యారంగంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని ఫ్యాప్టో పూర్వ ఛైర్మన్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పి.బాబురెడ్డి అన్నారు. విజయగౌరిని గెలిపించాలని కోరుతూ బుధవారం ఆయన రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ శాసన మండలిలో ఉపాధ్యాయుల, ఉద్యోగుల కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేస్తున్న కృషిని, వారు పోరాడుతున్న తీరును వివరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతున్నది కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని అన్నారు. ఈనేపథ్యంలో మన సమస్యలపై శాసనమండలిలో గళం వినిపించేందుకు విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.వాసు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎవి నాయుడు, ఎం.కృష్ణమూర్తి, ఎవి గౌరినాయుడు, గేదెల రమేష్, బి.నాగేశ్వరరావు, ఎం.రమేష్, ఎం.శ్రీనివాసరావు, జి.అప్పలనాయుడు, ఆర్.దాలినాయుడు, డోల కృష్ణారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్‌పిలతో రేంజ్ డిఐజి సమీక్ష



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్‌పిలు, ఇతర జిల్లా అధికారులతో విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపినాథ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సిరిపురంలోని విశాఖపట్నం రేంజ్ కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమీక్షలో గంజాయి నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, ఎన్‌బిడబ్ల్యు అమలు, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, పొక్సో కేసులు, హేయమైన నేరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా, సేవిస్తున్న వారిని గుర్తించి ప్రత్యేక షీట్స్ తయారు చేయాలన్నారు. గంజాయి ఆస్తుల స్వాధీనానికి, పీడీ యాక్ట్ పెట్టేందుకు, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న కేసుల పురోగతి, వాటి పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. హిట్ అండ్ రన్ కేసులలో బాధితులకు పరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నేరాల నియంత్రణ, బాధితులకు న్యాయం కల్పించే దిశగా కఠిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. పోక్సో, మహిళలపై జరిగే నేరాలకు సంబంధించి కేసులను త్వరగా విచారణకు తీసుకువెళ్లాలని, బాధితులకు న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఎస్‌పిలు తుహిన్ సిన్హా, వకుల్ జిందాల్, అమిత్ బర్దర్, కెవి.మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌వి.మాధవరెడ్డి, విశాఖపట్నం రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

వెహికల్ రికవరీ మేళా

152 వాహనాలు అందజేత

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలో ఎన్నో ఏళ్లుగా వివిధ కేసులలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను వెహికల్ రికవరీ మేళా ద్వారా తిరిగి యజమానులకు అందిస్తున్నామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏళ్ల తరబడి నగర పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నిరుపయోగంగా పడి ఉన్న వాహనాలను, పిఎం.పాలెంలోని పోలీస్ డంపింగ్ యార్డ్‌లో ఉన్న వాహనాలను యజమానులకు అందించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ వాహనాల వల్ల స్టేషన్ పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు, వాహనాలు పనికిరాకుండా పోతున్నాయని గుర్తించి, సమస్యను పరిష్కరించేందుకు వాటి యజమానులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 869 ద్విచక్ర వాహనాలను గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలు 114 ఉన్నాయన్నారు. మిగిలిన వాటిలో 272 వాహనాల యజమానులను గుర్తించినట్లు చెప్పారు. మరి కొన్ని కేసులలో పిటిషన్లు ఫైల్ చేయాల్సి ఉందని, వేలం కోసం 38 వాహనాలను గుర్తించామని, రెండు కేసులలో కోర్టు ఉత్తర్వులు రావాల్సి ఉందని, 401 కేసులలో పిటిషన్లు ఫైల్ చేసి ఉత్తర్వులు తీసుకున్నట్లు వివరించారు. ఈ క్రమంలో మొదటి విడతగా బుధవారం 152 వాహనాలను యజమానులకు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన వాహనాలను రెండవ విడత అందజేస్తామని చెప్పారు.